క్లుప్తంగా

పని ప్రదేశంలో మహిళల భద్రతకు చట్టం



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి ప్రత్యూష కుమారి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మహిళలకు పని ప్రదేశాలలో భద్రత కల్పించేందుకు 'పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపుల నిషేధ చట్టం 2013' అమల్లోకి వచ్చిందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి అన్నారు. స్థానిక జిల్లా న్యాయసేవాధికారసంస్థ కార్యాలయంలోనూ, లింగంపేట ప్రాంతంలోనూ శనివారం న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించారు. న్యాయమూర్తి ప్రత్యూష కుమారి మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను వివరించారు. పని ప్రదేశాలలో స్త్రీలపై జరిగే వేధింపులు, వివక్ష వారి హక్కులకు భంగం కలిగించడమేనన్నారు. అలాంటి చర్యలకు పాల్పడిన వారికి ఎలాంటి శిక్షలు విధిస్తారో వివరించారు. మహిళల హక్కుల పరిరక్షణ కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ పని చేస్తుందని, మహిళలకు ఉచిత న్యాయ సేవలు, న్యాయ సలహాలు అందిస్తుందన్నారు.

పాస్టర్ ఫెలోషిప్ కార్యవర్గం ఎన్నిక



సమావేశంలో మాట్లాడుతున్న జోసెఫ్ రమణ

సీటీఆర్ఐ: పాస్టర్స్ ఫెలోషిప్‌ను అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన డీబీవీ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు జోసెఫ్ రమణ అన్నారు. ధవళేశ్వరం, బొమ్మూరు, వేమగిరి (డీబీవీ) పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ఆర్థర్ ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా ఎస్.కృపాకర్ పాల్, కార్యదర్శిగా బి.రవిశేఖర్, సంయుక్త కార్యదర్శిగా జోసెఫ్, కోశాధికారిగా కె.స్వర్జన్ ఎన్నికయ్యారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ వివరాలను వెల్లడించారు.

బెంచీల వితరణ

ధవళేశ్వరం: స్థానిక పోలీస్ క్వార్టర్స్‌లోని షటిల్ కోర్టుకు రెడ్డి సంఘ నాయకుడు సావాడ శ్రీనివాసరెడ్డి నాలుగు బెంచీలను వితరణ చేశారు. సీఐ కె.మంగాదేవి సమక్షంలో సిబ్బందికి శనివారం వీటిని అందించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

24న పోలవరం నిర్వాసితుల సంఘీభావ సదస్సు

ప్రకాశం నగర్: పోలవరం ప్రాజెక్టు పునరావాసానికి కేంద్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని, నిర్వాసితుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 24న ధవళేశ్వరంలోని జక్కంపూడి సీతారత్నం మెమోరియల్ కమ్యూనిటీ హాల్లో సంఘీభావ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏజెన్సీ గిరిజన సంఘం అధ్యక్షురాలు వేట్ల విజయ, రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎంఎస్ నాగరాజు తెలిపారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సదస్సుకు సంబంధించిన పోస్టరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014 రాష్ట్ర విభజన సమయంలో పోలవరం ప్రాజెక్టు బాధ్యత కేంద్ర ప్రభుత్వమే తీసుకుంటుందని ప్రకటించారన్నారు. ప్రాజెక్టు మొదటి భాగంతో మునుగుతున్న దేవీపట్నం, పోలవరం మండలాల నుంచి ఖాళీ చేయించిన గ్రామాల నిర్వాసితులకు కూడా పూర్తి స్థాయిలో ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, కాలనీల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఆ సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందన్నారు. సమావేశంలో రైతుకూలీసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి దంతులూరి వర్మ, ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు వంజం జోగారావు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ రిమాండ్ ఖైదీ మృతి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న రిమాండ్ ఖైదీ మాటూరి వీరబాబు (26) శుక్రవారం రాత్రి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. రాజమహేంద్రవరం భాస్కర్ నగర్‌కు చెందిన మాటూరి వీరబాబును ఆరు నెలల క్రితం గంజాయి కేసులో త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేసి సెంట్రల్ జైలుకు రిమాండ్‌పై పంపించారు. ఈ నెల 8వ తేదీన వీరబాబుకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. జైలు సూపరింటెండెంట్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీటౌన్ ఎస్సై శ్యామ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

మధురపూడి: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో భాగంగా కోరుకొండ మండలం దోసకాయలపల్లి హైస్కూల్ క్రీడా మైదానంలో శనివారం క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. కాపవరం జట్టుపై కోరుకొండ-2, జంబూపట్నంపై కణుపూరు, నర్సాపురంపై మధురపూడి, శ్రీరంగపట్నంపై బూరుగుపూడి విజయం సాధించారు.

అంతా రామమయం

- రేపు అయోధ్యలో శ్రీరాముని విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ
- నగరంలో ఆధ్యాత్మిక సందడి



అయోధ్య నుంచి వచ్చిన అక్షతలను పంపిణీ చేస్తున్న హిందూ ధార్మిక సంస్థలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): అయోధ్యలోని రామ మందిరంలో సోమవారం బాలరాముని విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ చేయనున్న నేపథ్యంలో నగరంలో రామనామ స్మరణ మార్మోగుతోంది. అంతా రామమయం.. జగమంతా రామమయం అన్న చందాన ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూసిన శుభ గడియ దగ్గరలో ఉండడంతో భక్తులకు చెప్పలేని ఆనందం పొందుతున్నారు. ఈ నేపథ్యంలో గత నెల నుంచే జిల్లాలో హిందూ ధార్మిక సంస్థల ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేపట్టారు. శ్రీరామునికి గోదావరి తీరంలోనే ప్రాణప్రతిష్ఠ చేస్తున్నారా అన్నంతగా ఇక్కడి భక్తులు మమేకమయ్యారు. రాజమహేంద్రవరంలో పలు చోట్ల శ్రీరాముని చిత్రపటాలు ఫ్లెక్సీల రూపంలో ముద్రించి, వాటిని నగర కూడళ్లలో వేలాడదీశారు. హిందువుల తమ ఇళ్లపై శ్రీరాముని జెండాలను ఎగురవేశారు.

ఉమ్మడి తూర్పులో తొలి అడుగు

అయోధ్యలో రామ మందిరం నిర్మాణానికి ఐదు వెండి ఇటుకలు అందజేసిన హైదరాబాద్ వాసి, భాగ్యనగరం సీతారామ సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చల్లా శ్రీనివాసశాస్త్రి బంగారు పూత పూసిన 9 కేజీల వెండి పాదుకలను సమర్పించారు. వాటికి దాక్షారామ, అంతర్వేది పుణ్యక్షేత్రాల్లో పూజలు చేశారు. తాళ్లరేవు కోదండ రామాలయం, కాకినాడ శ్రీపీఠంలో భక్తుల సందర్శనార్థం ఉంచారు. గతేడాది అక్టోబర్ 28న రాయవరం మండలం వెదురుపాక నుంచి పాదయాత్రగా బయలుదేరి రాజమహేంద్రవరం, భద్రాచలం మీదుగా అయోధ్యకు చేర్చారు.

రామాయణ ప్రవచన యజ్ఞం

రాజమహేంద్రవరంలోని హిందూ సమాజంలో సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖ శర్మ ఆధ్వర్యంలో 41 రోజులుగా వాల్మీకి మహర్షి విరచిత రామాయణ ప్రవచన యజ్ఞం కొనసాగుతోంది. గత ఏడాది డిసెంబర్ 12వ తేదీన మొదలైన ఈ ప్రవచనాలు సోమవారంతో పూర్తికానున్నాయి. ఇదంతా శ్రీరాముని లీల అని సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. ఈ కార్యక్రమం నిర్వహించాలని కరోనా విజృంభణకు ముందే నిర్ణయం తీసుకున్నామని, అయితే కరోనా కారణంగా ఇప్పటి వరకూ వాయిదా పడిందన్నారు. అయోధ్యలో రాముని విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ జరిగే రోజునే ప్రవచనాలు పూర్తి కానుండడం శ్రీరాముని లీలా విలాసమే తప్ప మరొకటి కాదన్నారు. అలాగే ఈనెల 23న హిందూ సమాజంలో పట్టాభిషేక మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తవుతున్నాయన్నారు.



ఊరేగింపుగా వెలుతున్న శ్రీరాముని రథం

అక్షతల పంపిణీ

అయోధ్య నుంచి వచ్చిన అక్షతలను జిల్లాలోని పలు దేవాలయాల్లో భక్తుల దర్శనార్థం ఉంచారు. రాజమహేంద్రవరంలోని ఇస్కాన్, ఉమా మార్కండేయేశ్వరస్వామి ఆలయం, పలు వైష్ణవ దేవాలయాలు, శ్రీరాముని ఆలయాలలో వీటిని ఉంచారు. ఈనెల 15 నుంచి భక్తులకు పంచుతున్నారు. శనివారం రాజమహేంద్రవరంలో పలు హిందూ ధార్మిక సంస్థలు ఇంటింటికి వచ్చి అక్షతలు అందజేశాయి. రాజమహేంద్రవరంలోని సుబ్రహ్మణ్య మైదానంలో పూజ్యశ్రీ త్రిదండి చినజీయర్ స్వామి ఆధ్వర్యంలో సోమవారం బాలరాముని వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

అయోధ్యలో బాల రాముని విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ జరగనున్న నేపథ్యంలో నగరంలోని ఏవీ అప్పారావు రోడ్డు రామాలయం సెంటర్ నుంచి శుక్రవారం మధ్యాహ్నం శ్రీరామ విజయ యాత్ర నిర్వహించారు. దానవాయిపేట, జాంపేట, లక్ష్మీవారపుపేట, కోటగుమ్మం, మెయిన్ రోడ్డు, కోటిపల్లి బస్టాండ్, రైల్వే స్టేషన్ మీదుగా ఆల్కాట్ గార్డెన్స్‌లోని గేదెల నూకరాజు కల్యాణ మంటపం వరకూ యాత్ర సాగింది. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక ప్రవచనాలు చేసి, భక్తులకు ప్రసాద వితరణ నిర్వహించారు.

రామనామ స్మరణ

రాజమహేంద్రవరంలో శుక్ర, శనివారాల్లో రామ నామ సంకీర్తనలు హోరెత్తాయి. గరగలు, డప్పు వాయిద్యాలు, తప్పెటగుళ్లు, కోలాట బృందాల భజనలు, కేరళ చెండై వాయిద్యాలు, పొడుగు మనుషులు, పౌరాణిక వేషధారణలు ఆకట్టుకున్నాయి. జిల్లాలోని పలువురు అధ్యాత్మికవేత్తలకు అయోధ్య నుంచి పిలుపు వచ్చింది.



బాపిరాజు గీసిన చిత్రం



ఆకట్టుకున్న ఆంజనేయుని వేషధారణ

అయోధ్యకు బాపిరాజు చిత్రం

అయోధ్యలో నిర్వహించే చిత్రకళా ప్రదర్శనలో రాజమహేంద్రవరానికి చెందిన చిత్రకారుడు పుష్పాల బాపిరాజు గీసిన తైలవర్ణ చిత్రానికి చోటు దక్కింది. భారతదేశ చిత్రపటంలో శ్రీరాముని చిత్రంతో ఆకట్టుకునే రీతిలో రామభక్తిని ప్రతిబింబించేలా గీశారు.

ఇంటింటికీ 'జై శ్రీరామ్'



కడియపులంకలో జై రామ్ స్టిక్కర్లు అతికిస్తున్న యువకులు

కడియం: అయోధ్యలో రామాలయ ప్రతిష్ఠాపనను పురస్కరించుకుని కడియపులంకలో ప్రతి ఇంటికీ జై శ్రీరామ్ స్టిక్కర్లను అతికించారు. బొరుసు గని రాజు, మిత్ర బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు. సోమవారం దీపోత్సవం సందర్భంగా గ్రామంలో ముసలమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

జాతీయ టీటీ పోటీలకు ఇద్దరి ఎంపిక



జాతీయ పోటీలకు ఎంపికైన సిరి పావని, తాన్యశ్రీ

ప్రకాశం నగర్ : జాతీయ టేబుల్ టెన్నిస్ పోటీలకు గౌతమీ టేబుల్ టెన్నిస్ అకాడమీకి చెందిన గిడుతూరి సిరి పావని, గిడుతూరి తాన్యశ్రీ ఎంపికయ్యారని కోచ్ వీటీవీ సుబ్బారావు తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఆదివారం నుంచి ఈనెల 24 వరకూ జరిగే 85వ సబ్ జూనియర్ అండ్ క్యాడేట్ నేషనల్ టేబుల్ టెన్నిస్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు. రాష్ట్రంలో జరిగిన వివిధ ర్యాంకింగ్ పోటీలలో సాధించిన విజయాల పాయింట్ల ఆధారంగా సిరి పావని సబ్ జూనియర్స్ (అండర్ 15) విభాగంలో స్టేట్ నెంబర్ వన్, తాన్యశ్రీ క్యాడిట్ (అండర్ 13) విభాగంలో స్టేట్ నెంబర్ త్రీ ర్యాంకులు సాధించి, ఈ పోటీల్లో పాల్గొనడానికి అర్హత సాధించారన్నారు. విజేతలను జిల్లా టేబుల్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు విశ్వనాథం భాస్కర రామ్, అధ్యక్షుడు జేవీవీ అప్పారెడ్డి, కోశాధికారి కె.సత్యనారాయణ అభినందించారు.

మండలస్థాయి విజేతలకు అభినందన

కడియం: ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన క్రీడాకారులు మరింత ఉత్సాహంగా రాణించాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ అన్నారు. మండల స్థాయి విజేతల అభినందన కార్యక్రమం శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో కె.రత్నకుమారి అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విజేతలకు క్రీడా కిట్‌లను పంపిణీ చేశారు. స్టాలిన్ మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను వెలుగులోకి తీసుకువచ్చేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. ఆయన ఆశయాన్ని నిజం చేస్తూ ఎంపిక చేసుకున్న క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్న క్రీడాకారులను అభినందించారు. జేగురుపాడు నుంచి విజేతలుగా నిలిచిన జట్లకు వ్యక్తిగతంగా నగదు బహుమతిని అందించారు.

విజేతలు వీరే..

మండల స్థాయి వాలీబాల్‌లో పురుషులు, మహిళల విభాగంలో జేగురుపాడు జట్లు విజయం సాధించాయని మండల క్రీడాధికారి పి.డేవిడ్ తెలిపారు. కోకో, బ్యాడ్మింటన్‌లో దుళ్ల గ్రామానికి చెందిన జట్లు నియోజకవర్గ స్థాయి పోటీలకు చేరాయన్నారు. మహిళల బ్యాడ్మింటన్‌లో వేమగిరి జట్టు నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ లక్ష్మి, ఏవో చంద్రరావు, గ్రామ పంచాయతీల కార్యదర్శులు, పీఈటీలు పాల్గొన్నారు.



విజేతలను అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు స్టాలిన్, ఎంపీడీవో రత్నకుమారి

త్వరలో రామనామ స్తూప నిర్మాణం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): హిందూ సమాజంలో గత నెల 12వ తేదీన ప్రారంభమైన రామాయణ ప్రవచన యజ్ఞంలో శుక్రవారం రాత్రి వరకూ భక్తులు 26 కోట్ల రామనామాలు రచించిన ప్రతులను సమర్పించారని సామవేదం షణ్ముఖ శర్మ తెలిపారు. రానున్న రోజులలో ఈ సంఖ్య మరింత పెరగవచ్చునన్నారు. వీటితో రాజమహేంద్రవరం శివారున గల కొంతమూరులో తాను నిర్మించిన వల్లభ గణపతి ఆలయ ప్రాంగణంలో రామనామాల ప్రతులతో స్తూపాన్ని నిర్మించనున్నట్టు తెలిపారు. ఈ విషయాన్ని శుక్రవారం రాత్రి ప్రవచనానంతరం ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా భాగవత విరించి డాక్టర్ టీవీ నారాయణరావు మాట్లాడుతూ పెద్ద జీయరు స్వామి దేశ వ్యాప్తంగా సుమారు 108 రామనామాలతో కూడిన స్తూపాలను నిర్మించారని, తిరుపతి, భద్రాచలం వంటి దివ్యక్షేత్రాలలో సైతం ఇటువంటి స్తూపాలు ఉన్నాయని తెలిపారు. భక్తులు రామనామాలు రాసిన కాగితాలు శిథిలమై, పంచభూతాలలో కలసిపోయినా, శక్తివంతమైన ఆ రామనామ తరంగాలు వాతావరణంలో వ్యాప్తి చెంది వాతావరణ కాలుష్యాన్ని, మనో కాలుష్యాన్ని తొలగిస్తాయన్నారు.



26 కోట్ల రామనామ లిఖిత ప్రతులు

శరవేగంగా కులగణన



90వ సచివాలయ పరిధిలో కులగణన చేస్తున్న ప్లానింగ్ సెక్రటరీ జగ్గారావు, వలంటీర్ దుర్గ



15వ డివిజన్‌లో సర్వే చేస్తున్న వలంటీర్లు సాయిలక్ష్మి, సింధు

- చరిత్రాత్మక ప్రక్రియకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వం
- పారదర్శకంగా సర్వే

సీటీఆర్ఐ: సామాజిక సాధికారతకు పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయానికి శ్రీకారం చుట్టింది. బడుగు, బలహీన వర్గాల చిరకాల వాంఛను నెరవేరుస్తూ కులగణన చేపట్టింది. రాజమహేంద్రవరం నగరంలోని 96 సచివాలయ పరిధిలో ఈ నెల 29 తేదీ వరకు ఈ సర్వే సాగనుంది. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రత్యేక యాప్ ద్వారా డేటా ఎంట్రీ చేపట్టారు.

తొలి రోజు ఇలా..

సమగ్ర కులగణన సర్వే పూర్తి పారదర్శకంగా జరుగుతోంది. కుటుంబ సభ్యులు వెల్లడించిన వివరాలనే సర్వే సిబ్బంది నమోదు చేస్తారు. వివరాలకు చెందిన ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు తీసుకోరు. కులాంతర వివాహాలు చేసుకున్న వారికి ఎవరి కులం వారికే నమోదు చేస్తారు. ఎవరైనా వివరాలు చెప్పేందుకు ఇష్టపడకపోతే బలవంతం చేయకూడదు. సేకరించిన సమాచారం ప్రభుత్వం వద్ద ఉంటుంది. వివరాల నమోదు సమయంలో ఈ-కేవైసీ తప్పనిసరి.

రాజమహేంద్రవరంలో..

రాజమహేంద్రవరంలోని 96 సచివాలయ పరిధిలో 1,11,985 కుటుంబాలను సందర్శించాల్సి ఉండగా, శుక్రవారం 86 సచివాలయాలు ఈ సర్వేలో పాల్గొన్నాయి. తొలిరోజు శుక్రవారం వెయ్యికి పైగా, శనివారం 22, 500 కుటుంబాలను కలిశారు. రాత్రి కూడా ఈ కార్యక్రమం కొనసాగింది. పనులు, ఉద్యోగ రీత్యా పగటి పూట అందుబాటులో లేని వారిని, సాయంత్రం కలుస్తున్నారు.

నవరత్నాలతో పేదల ఆర్థిక అభ్యున్నతి

రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలు పేదల ఆర్థిక అభ్యున్నతికి దోహదపడుతున్నాయని మండల జేసీఎస్ ఇన్‌చార్జి తాటికొండ విష్ణుమూర్తి అన్నారు. శాటిలైట్‌సిటీ గ్రామ సచివాలయం-3లో శనివారం సాయంత్రం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ఆయన, సచివాలయ కన్వీనర్లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సచివాలయం పరిధిలో డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా సీఎం జగన్ అందించిన లబ్ధిని తెలిపే డిజిటల్ బోర్డును ఆవిష్కరించి, మా నమ్మకం నువ్వే జగనన్న బుక్‌లెట్‌ను విడుదల చేశారు. అనంతరం గ్రామ ముఖ్య కూడలిలో పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తాడి కృష్ణ, సచివాలయ కన్వీనర్లు రుంకాని రమణమ్మ, బత్తిన అప్పారావు, పుచ్చా గోవిందరెడ్డి, మాజీ ఉపసర్పంచ్‌లు బొమ్మ శ్రీను, కడవకొల్లు వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ కాకరపల్లి అప్పారావు, పార్టీ నాయకులు రుంకాని రవికుమార్, పుచ్చా ప్రసన్న కుమార్ రెడ్డి, మీగడ గంగాధర్, ఎంవీవీ సత్యనారాయణ, దండంగి శ్రీనివాస్, పగడం లక్ష్మణరావు, మనోహర్, వెంకాయమ్మ, కరీమ్, జుత్తిక శ్రీను పాల్గొన్నారు.



మా నమ్మకం నువ్వే జగనన్న బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న విష్ణుమూర్తి తదితరులు

ఉత్సాహంగా చదరంగం పోటీలు

ప్రకాశం నగర్: జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో స్థానిక యంగ్ మెన్స్ అసోసియేషన్ హాల్లో శనివారం రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలు ఉత్సాహంగా జరిగాయి. కార్యక్రమానికి వైఎంఏ కోశాధికారి కాకి రామకృష్ణ, క్రీడా కార్యదర్శి మద్దుల చైతన్య ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఈ పోటీల్లో విజేతలైన మొదటి 20 మంది క్రీడాకారులకు రూ.50 వేలు నగదు బహుమతి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా చదరంగం సంఘం కార్యదర్శి జీవీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



పుణ్యక్షేత్రంలో ఎంపీటీసీ సభ్యుడు పలివెల వెంకట్రావును పరామర్శిస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

రాజానగరం: నియోజకవర్గంలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి శనివారం పరామర్శించారు. రాజానగరం మండలం కొండగుంటూరుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు ఉర్రింకల శ్రీనివాస్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే గ్రామంలోని తంబాబత్తుల వెంకటేశులు, కత్తి కృష్ణారావు, రేలంగి పుత్రయ్య, గిరిజాల మంగియమ్మ, తమ్మరబోయిన లక్ష్మి కుటుంబ సభ్యులను ఓదార్చారు. భార్య వియోగంతో బాధపడుతున్న జి.యర్రంపాలేనికి చెందిన పల్లేటి నాగేశ్వరరావు, పుత్ర శోకంలో ఉన్న మారంపూడి ఏసురత్నాలను పరామర్శించారు. భార్య వియోగంలో ఉన్న పుణ్యక్షేత్రం ఎంపీటీసీ సభ్యుడు పలివెల వెంకట్రావును పరామర్శించారు. కోరుకొండ మండలం గుమ్ములూరుకు చెందిన మరుకుర్తి నరసయ్యమ్మ కుటుంబ సభ్యులను కలిశారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

సీతానగరం: మండలంలోని బొబ్బిల్లంక, జాలిమూడి, కాటవరం, మునికూడలి, వెదుళ్లపల్లి, రాజంపేట, ఇనుగంటివారిపేట, ముగ్గళ్ల, రఘుదేవపురం, సీతానగరాల్లోని 30 పోలింగ్ బూత్‌లను శనివారం రాజమహేంద్రవరం ఆర్‌డీవో ఏ.చైత్రవర్షిణి పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో తాగునీటి సదుపాయం, విద్యుత్, మరుగుదొడ్లు, లైటింగ్, ఫ్యాన్లు తదితర వాటిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన పోలింగ్ బూత్‌లను తక్షణమే పరిశీలించి, తగు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ కృష్ణారావుకు సూచించారు.

భక్తిశ్రద్ధలతో పాశాలమ్మ జాతర



పాశాలమ్మవారి రథం వద్ద ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరం గ్రామ దేవత పాశాలమ్మ జాతర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం అమ్మవారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అమ్మవారిని దర్శించుకున్నారు. ఊరేగింపు సందర్భంగా రథం వద్ద కొబ్బరికాయ కొట్టి పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అమ్మవారి జాతరను వైభవంగా నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీని అభినందించారు. ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తానని తెలిపారు. ఇప్పటికే ఆలయం వెనుక కల్యాణ మంటపం నిర్మాణం కోసం రూ.10 లక్షలు గ్రాంటు ఇవ్వడం జరిగిందన్నారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా కొంత స్థలాన్ని కూడా కేటాయించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జాజుల రాము, ఉత్సవ కమిటీ నాయకులు కాలచర్ల పెద్దకాపు, తగరంపూడి దుర్గారావు, కాలచర్ల గోవిందు, గుగ్గిలం రవి, వైఎస్సార్ సీపీ నాయకులు కాలచర్ల చిన్నారావు, కాలచర్ల శివాజీ, ఎంపీటీసీ సభ్యుడు కాలచర్ల నాగు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	: సైంధవ్
సూర్యమినీ	: సైంధవ్, నా సామిరంగ
సూర్యప్యాలెస్	: గుంటూరుకారం
స్వామి	: గుంటూరుకారం
శివజ్యోతి	: నా సామిరంగ
అనుశ్రీ	: హనుమాన్
రాజా	: హనుమాన్
అశోక	: సలార్
ఊర్వశి	: నా సామిరంగ
రంభ	: నా సామిరంగ
మేనక	: హనుమాన్
అప్సర	: గుంటూరుకారం
కుమారి	: గుంటూరుకారం
నామవరం	
వీఎస్ మహల్	: హనుమాన్, నా సామిరంగ, సైంధవ్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: నా సామిరంగ, గుంటూరుకారం
కడియం	
వెంకటసూర్య	: హనుమాన్, నా సామిరంగ